# కోతి చేతిలో వజ్రం

బ్రహ్మలోకంలో సరస్వతి వీణ అభేరిరాగాన్ని ఆలపిస్తోంది.

✦ ✦ ✦

కట్ చేస్తే..... భూలోకంలో పల్లెటూరు

ఇరవై ముప్పై ఇరుకిరుకు వీధుల్తో.. పది పదిహేను వేల జనాభా ఉన్న చిన్న వూరు అది.

కులవృత్తుల వాళ్ల పేటలూ, నిమ్నకులాల వారి గూడేలు, కామందుల

వీధి, బ్రాహ్మలగ్రహారం, స్కూలు వీధి, గుడి వీధి, పోస్టాఫీసు వీధి, బ్యాంకు వీధి... కాలవ రోడ్డు... మున్సబుగారి సందు- కాంగ్రేస్ పేటా... రచ్చ బండ- కలిస్తే ఆ వూరు.

ఊరు పొలాల మధ్యలో ఉంటే.. బస్సు రోడ్‌కీ.. ఊళ్లోకి కంకర రోడ్డు ఉంది.

బస్ రోడ్డుకి అవతల వైపు పిల్ల కాలువ- కాలవరేవులో టూరింగ్ సినిమా హాలు- సినిమాహాలు ప్రహరీలోనే ఓ కాళ్లబల్ల టీకొట్టు.

ఆ కాళ్లబల్ల టీ కొట్టులో 23 ఏళ్ల శీనుగాడు... టీ కప్పులు కడుగుతూ... ఇడ్లీ, దోసె, ఉప్మా.. వగయిరా టిఫెన్లు సరఫరా చేస్తూ... బిల్లు వసూలు చేస్తూ ప్రొద్దుట ఆరుగంటల నుంచి.. మధ్యాహ్నం 12 గంటల వరకూ చెయ్యి తడారకుండా పనిచేస్తాడు.

మళ్లీ సినిమా తొలాట మొదలుపెట్టే ఆరు గంటల నుండి రాత్రి రెండో ఆటయ్యేదాకా హడావుడిగా ఉంటాడు. ఆ హాలుకి వచ్చిన సినిమాలు ఆడే నాలుగు రోజులూ రెండో ఆట చూస్తాడు.

పాటలు బావుంటే మొదటి ఆటకి కూడా ఆ టైముకి తెర ముందుకెళ్లి చెవులప్పగిస్తాడు శ్రీనుగాడు- వాడు పని చేస్తున్నంతసేపూ పాట పాడుతూంటాడు.

శీనుగాడి గొంతులో మగత్యం ఉందిరా-

ఆర్నీయవ్వ... గంటసాలోడ్ని మింగి పుట్టాడ్రా ఈడు.

ఒకసారినగానే పాట పట్టేస్తాడు అంటూ తెగ మెచ్చుకుంటారు.

వాడి పాట ఆ ఊళ్లోవాళ్లు ఆ హోటలుకో మంచి ఎట్రాక్టు పాయింటయ్యింది.

ఓసారి వాడి పాట విని సినిమాహాలు ఓనరు కృష్ణారెడ్డి రిక్షా బండిమీద సినిమా ప్రచారానికి మైకు సెట్టుతోబాటు శ్రీనుగాణ్ని వెళ్లమన్నాడు.

ఆ పార్ట్ టైమ్ ఉద్యోగం శీనుగాడి దశని మార్చేస్తుందని ఎవరూ అనుకోలేదు.

ప్రతీ వీధి మొగసాలల్లో విడుదలైన సినిమాల్లో పాటలు పాడుతూ- ఆ వరసల్లో కొత్తపాట కట్టి వినిపిస్తుంటే ఆ వీధుల్లో ఆందరూ... అతనికి అభిమానులు అయిపోతున్నారు. ప్రతీ వ్యక్తీ ఆ సినిమాకి రమ్మన్న పిలుపు తనకోసమే అన్నంత ఆత్మీయంగా వినేవారు.

గొంతు, తెలివితేటలూ, దానికి తగ్గట్టు అందమైన స్ఫురద్రూపం చమత్కారభరితమైన ఎనౌన్స్‌మెంట్ అతన్ని సర్వజన సమ్మోహితుణ్ని చేశాయి.

కామందు భూపతిగారి అమ్మాయి కిరణ్మయి అతని పాటని పైటగా వేసుకునేది- అతని మాటల్ని మనసులో పోసుకునేది. అతన్ని కళ్లల్లో దాచుకునేది- అతన్ని కలల్లోకి రప్పించుకునేది- అందమైన కిరణ్మయిని చూడగానే శీనుగాడికి మాటా పాటా మరింత ప్రవాహంగా జాల్వారేవి. ఆమె అభిమానాన్ని తొలిరోజుల్లోనే కనిపెట్టేశాడు శీను.

మాట కలపాలని మనసుపడి... మంచినీళ్లు అడిగాడు- శీను. చల్లటి మజ్జిగిచ్చింది కిరణ్మయి- అతను పరవశంగా కళ్లతో థేంక్స్ చెప్తే.. సిగ్గుతో పులకరించిపోయిందామె.

మీ మనసులా మెత్తని కథ... మీ నవ్వులా చల్లని హాస్యం- తెరమీద మీరే కనిపిస్తున్నంత అందమైన అనుభూతి.. తప్పకరండి! నేడే చూడండి అంటూ సినిమానో.. ఆ అమ్మాయినో.. తెలీనట్టు పొగడ్తల్తో మాటల్తో పాటల్తో మంత్రం వేసేస్తున్నాడు శీనుగాడు.

కిరణ్మయీ చెలికత్తెలూ... ప్రతీ సినిమాకి వెళ్లటం మొదలుపెట్టారు.

సింగిల్ ప్రొజెక్టర్ టూరింగ్ హాలు కనుక సినిమా మధ్యలో మూణ్నాలుగు స్పెషల్ ఇంట్రవెల్‌లు ఉంటాయి (రీలు మార్చడానికి).

ఆ టైములో కుర్చీ టిక్కెట్టు వరసలో ఉన్న కిరణ్మయికీ ఆమె స్నేహితురాళ్లకీ... టీ అందించే వంక బాగా వినియోగపడింది వాళ్ల స్నేహానికి. వేడి వేడి టీ గ్లాసులందిస్తూన్నప్పుడు వేళ్లు చల్లగా కలిసేవి- పులకింతలు ఆవిరిగా ఎగిరేవి- రాన్రానూ చిట్టీలు రాసుకోవటాలూ- జవాబులు అందుకోవటాలూ దాకా స్నేహం కొనసాగింది.

కిరణ్మయి రహస్యంగా లేఖలందిస్తే శీనుగాడు సినిమా ఎనౌన్స్‌మెంట్ ముసుగులో... మైకులో బాహాటంగానే ప్రేమకథలు జవాబుగా చెప్పేవాడు.

ఇలా పేటకో కిరణ్మయి- వీధికో కిరణ్మయి అతన్ని చకచ్చకిత నయనాల్తో చూసి మదిలోకి ఆవాహన చేసుకున్నారు.

శ్రీనుగాడికి తన గ్లామర్ మీద తనకే నమ్మలేనంత నమ్మకం కుదిరిపోయింది!

కాస్త ఇరుకు సందుల మురికిగూడెంలో మరుగుచూసి ఓ అభిమాని చెయ్యి పట్టుకున్నాడు శ్రీనుగాడు- ఆ అమ్మాయి పెద్దవాళ్లు ఊరంతా ఊరేగిస్తూ బడిత పూజ చేశారు. ఊరవతలకి తరిమేశారు. కిరణ్మయి తాను వాడి వలనుంచి తప్పించుకున్నందుకు దేవుడికి దణ్ణం పెట్టుకుంది.

✦ ✦ ✦

అయిదారేళ్లు గడిచిపోయాయి.

భాగ్యనగరంలో సినీ కాలనీ

కామందు భూపతిగారు ఓ సినిమా తీయాలన్న ఉబలాటంతో హైదరాబాద్ వచ్చారు. డబ్బుల మూటచూసి ఎగిరి గంతేసి ఓ డైరెక్టర్

ధైర్యంగా అందరికీ ఎడ్వాన్స్ ఇప్పించేశాడు. కెమేరాకి రామ్‌జీ- పాటలు సంగీతం ఎస్ఎన్- హీరో సినీజీవి- హీరోయిన్ బాంబే బాబి ఇలా అందరిని బుక్ చేసాడు. పాటల రచన, సంగీతం చేస్తానన్న ఎస్ఎన్‌ని చూడగానే భూపతికి అతను శ్రీనుగాడేమోనని అనిపించింది. అయితే నేను శ్రీనుగాడిని కాదన్నంత నమ్మకంగా నటించాడు. ఎస్.ఎన్.. మనిషి మాటావాటం మారింది. సక్సెస్ తెచ్చిన కళ. ఏసీ రూముల్లో రంగు తేలిన మేని మెరుపు గోల్డ్ ఫ్రేమ్ కళ్లజోడు- తెల్లటి కుర్తా పైజామా... వేళ్లకి నవరత్నాల ఉంగరాలు- శిష్యమిత్ర బృందం మధ్యలో విఐపీలా వెలిగిపోతున్న ఈయనెక్కడ- కాఫీ కప్పులు కడిగే కాళ్లబల్ల టీకొట్టువాడెక్కడ? భూపతి మనస్సులో కలిగిన అనుమానాన్ని అవతలకి గెంటేశాడు!

తమిళయాసలో ఇంగ్లీషు మాటలు కలిపి... సంగీత దర్శకత్వానికి గీతరచన కూడా చేసివ్వడానికి ఎగ్రిమెంట్ కుదుర్చుకున్నాడు. మ్యూజిక్ సిటింగ్‌కి బెంగుళూరు ఫిక్స్ చేసాడు డైరెక్టర్.

"నో.. ఇది పల్లెటూరి సబ్జెక్ట్... ఆంధ్రా విలేజ్ బావుంటుంది" అన్నాడు పాను నవుల్తున్న ఎస్.ఎన్.

"వెరీగుడ్! అదీ సిన్సియార్టీ!" అని వంతపాడి...

భూపతిగారి వూరు వారి బంగ్లాలో మకాం ఫిక్స్ చేశారు సినిమా టీము.

కళ్లు తెరిచిన పిల్ల ఊరు.... ఆ పల్లెటూరుకొచ్చాడు....

కొత్తవేషంతో- ఎస్.ఎన్. అనే శీను.

పూర్వాశ్రమంలో ఎస్.ఎన్. అదే...శీను ఎన్నిసార్లో ఆ బంగ్లా లోపలికి వెళ్లాలనుకునేవాడు.

కిరణ్మయి అందమైన అమాయకత్వం- ఆరాధనా భావం అందీ

అందకుండా చేజారిపోయింది. ఇప్పుడు కొత్త హోదాలో ఆ గడపలోకి అడుగుపెడ్తున్న ఎస్.ఎన్.కి పాత శ్రీనుగాడి బుద్ధి ఆవహించింది!

కళ్లు కిరణ్మయి కోసం వెతుకుతున్నాయి.

మేడమీద విశాలమైన గెస్టురూమ్‌లో సెక్రటరీతోబాటు ప్రవేశించాడు. దర్శకుడు వచ్చి సిట్యుయేషన్స్ చెప్పి వెళ్లిపోయాక పాట కట్టడానికి మూడ్ రావట్లేదు. నాలుగైదు రోజులు గడచిపోయాక బాల్కనీ నుంచి చూస్తే... కిరణ్మయి పసిపాపనెత్తుకుని ఇంటిముందు ఆటో దిగుతూ కనిపించింది. మనసు పొంగింది.

'ఆనాటి పాట నినదించె నాలో- మున్నేటి మాటకి శృతి దొరికెలోలో...' అని బంగ్లా అంతా రాగమాధురులు చల్లాడు.

కిరణ్మయి ఆ గొంతులో శ్రీనుగాడిని పోల్చుకుంది.

నాన్న సినిమా తీస్తున్నాడని- పైన మ్యూజిక్ సిటింగ్ అని తెల్సుకుంది.

పెళ్లయిపోయి ప్రశాంత గీతంలా సాగుతూన్న జీవితంలో అది అపశృతిలాగే అనిపించింది.

భూపతి తన కూతుర్ని పిలిచి మ్యూజిక్ డైరెక్టర్‌కి పరిచయం చేశాడు.

అపరిచితురాల్లాగే ఉందామని నమస్తే అంది-

"మా అమ్మాయి చాలా బాగా పాడుతుంది" అన్నాడు భూపతి.

"ఓ వెరీగుడ్ మన సినిమాలో ఓ పాట పాడిద్దాం"

"వద్దండీ- మావారికి పాటలంటే పడదు"

"ఏం కాదు అల్లుడితో నేను మాట్లాడతాను.. మీరు పాట నేర్పండి సార్" అంటూ భూపతి ఫోను చెయ్యడానికి కిందకి వెళ్లాడు.

కాస్త ఏకాంతంలో "నేను శ్రీనుని!" అన్నాడు

"తెలుసు"

"మీ నాన్నకి తెలియదు"

"ఆ సంగతి ఇప్పుడనవసరం"

"నిన్ను గొప్ప గాయనిగా చేస్తాను"

"అవసరం లేదు... నాకిష్టంలేదు"

.........

........

చెంప ఛెళ్లుమంది శ్రీనుగాడికి.

ఎడాపెడా వాయించింది!

భూపతి 'ఎస్‌ఎన్'గాడి నిజస్వరూపం తెలిసి- ఆగ్రహంతో రెచ్చిపోయాడు.

శీనుగాడిని ఆ వూరి రోడ్లు రెండోసారి సత్కరించాయి. అప్పుడు.. జనబలం మాత్రమే వాణ్ని తరిమేస్తే... ఇప్పుడు జనబలం... ధనబలం వాణ్ని అత్యాచార నేరంతో కటకటాల్లోకి నెట్టాయి.

బ్రహ్మలోకం

సరస్వతి వీణ విషాదరాగం పలికింది.. సంగీత సాహిత్యాల పరువు నేల జారినందుకు కాటుక కంటినీరు ఇంకోసారి జాల్వారింది.

బ్రహ్మ వ్యాఖ్యానిస్తూ... ఓదార్చాడు- "సరస్వతీ! కోతి చేతిలో వజ్రం... పిచ్చాడి చేతిలో రాయికన్నా ప్రమాదం" అన్నాడు.